# సమూహం

## వేపచేదు వెంకటరమణ

సాయంత్రం ఆరవుతోంది. రోజంతా ఎండలో ఒళ్ళు దాచుకోకుండా పని చెయ్యటంవల్లనేమో మొహం ఎర్రగా కంది, మెల్లమెల్లగా పశ్చిమాద్రిలో తల దాచుకుంటున్నాడు సూర్యుడు.

అప్పుడే ప్రాక్టికల్స్ అయిపోజేసి నీరసంగా డిపార్ట్‌మెంట్ నుంచి బయటకి వచ్చారు ఎమ్మెస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న లత, లక్ష్మి. "మన వింగ్‌లో కరెంటు పోబట్టి సరిపోయింది కాని లేకపోతే ఇవ్వాళ కూడా ఎనిమిదయ్యేది" అనుకుంటూ.

హుష్‌మని నిట్టూర్చుకుంటూ బస్టాప్ దగ్గరి సిమెంట్ బెంచీపై చతికిలబడ్డారు బస్‌కోసం ఎదురుచూస్తూ. అంతలో "హల్లో లత, లక్ష్మి బాగున్నారా? మొన్న యు.జి.సి. ఎగ్జామ్ ఎట్లా రాశారు? బాగా కష్టపడు తుంటారుగా బానే రాసుంటారులే." అంటూ ప్రక్కన కూర్చుని మాటలు కలిపింది ఎమ్.ఎ. లిట్ చేస్తున్న హాళ్ళ ఫ్రెండ్ రుక్మిణి.

"ఏదో మామూలుగా రాశాను. అంత నమ్మకమేమీ లేదుగాని చూద్దాం" అంది లక్ష్మి.

"నేనసలు రాయలేదు" ముభావంగా జవాబిచ్చింది లత.


"ఏం బాగా ప్రిపేర్ అయి సి.ఎస్.ఐ.ఆర్. ఫెల్లో-షిప్‌కే గట్టిగా ప్రయత్నం చేద్దామనా" నవ్వుతూ అడిగింది రుక్మిణి.

"అసలు నేను పిహెచ్.డి. చేయను, ఉద్యోగం చేయను. ఎమ్మెస్సీ అయినా ఏదో ఊరికినే చేశాను. ఇంట్లోనే వుంటాను" అంది లత.

"ఊ! నెలకో పెళ్ళి చూపులకి గంగిరెద్దులా తయారయి కూర్చుంటూ, అడిగినంత కట్నమిచ్చి ఇంకెప్పుడు పెళ్ళిచేస్తారాని పోట్లాడుతూనా" ఉడికించింది రుక్మిణి.

"ఇంట్లో కూచునే వాళ్ళే ఏంటి? పి.హెచ్.డి.లు, ఉద్యోగాలు చేస్తుంటే మాత్రం ఎవరూ పెళ్ళి చూపులక్కూర్చోవట్లేదా? నువ్వైనా మంచి ఉద్యోగం చేస్తున్న సంబంధం ఏదైనా మీ వాళ్ళు తెస్తే ఒప్పుకోవా? మనం ఒకళ్ళకొకళ్ళం నచ్చితే సరి. డబ్బు సంగతి పెద్దవాళ్ళు చూసుకుంటారు" కోపంగా చెప్పింది లత.

"అదే నీకు నాకు తేడా. సాధారణంగా పెద్దవాళ్ళు కుదిర్చే సంబంధాలలో ప్రాముఖ్యత వహించేది కులం, గోత్రం, డబ్బు. వాటి తరువాతే నువ్వూ నీ ఇష్టమూను. నీకు, చేసుకునే అతనికి ఒకరికొకరు పూర్తిగా ఇష్టమయినా కులం, గోత్రం, డబ్బు ఈ మూడిటిలో దేంట్లో సరిగ్గా కుదరకపోయినా మీ ఇష్టాలన్నీ గంగలో కలుస్తాయి. అందుకే నాకు నచ్చినవాణ్ణి, నా భావాలను అర్థం చేసుకునే యువకుణ్ణి స్నేహం ద్వారా కలుసుకుని, ప్రేమించి నేనే పెళ్ళి నిశ్చయించుకుంటాను గాని, 'ఇంట్లో తండ్రి అనేవాడు ఒకడున్నాడు కదా! బుద్ధి తక్కువయి కన్నందుకు చచ్చినట్టు ఇల్లమ్మో, అప్పచేసో పెళ్ళి చేస్తాడులే' అని మొద్దులాగా నేనేమీ ఇంట్లో కూచోను. నాకు కట్నం తీసుకుని అబ్బాయిలంటే ఎంత అసహ్యమో, దానిని తప్పించుకోవటానికిగాని, ప్రతిఘటించడానికి ఏమాత్రం ప్రయత్నం చెయ్యని ఆడవాళ్ళంటే అంతకంటే పరమ అసహ్యం" ఆవేశంగా జవాబిచ్చింది రుక్మిణి.




"సర్లే ఉపన్యాసాలియ్యటం కాదు. పెద్దవాళ్ళు చేసే పెళ్ళి అయితేనే కట్నం తీసుకున్నా, తీసుకోకపోయినా ఆడదానికి ఎక్కువ సుఖం. ఊరికే ప్రేమ, దోమ అని ఏ కులంగాని వాడి వల్లోనో పడి తల్లిదండ్రులతో పోట్లాట తెచ్చుకోవటం అవివేకం. చూద్దాంగా పెళ్ళయిన తర్వాత ఎవరెక్కువ సుఖపడతారో?" అంది లత.

"అది కాదే లతా! ఈ ఈ కండీషన్స్ మీదనే నీతోటి వుంటాను అని జరిగే బేరం కంటె నీకోసం ప్రపంచం మొత్తాన్ని ఎదిరించడానికి సిద్ధమై జరిగే ప్రేమ వివాహంలో ఎంతో గొప్పతనం లేదూ? పెళ్ళయిన తరువాత సర్దుకుపోవటం, భార్యగా ప్రేమించబడటం కంటె, ముందే నీ వ్యక్తిత్వాన్ని గౌరవించి, అర్థం చేసుకుని పెళ్ళి చేసుకుని నిన్ను తన హృదయరాణిగా ప్రేమించటంలో ఇంకా ఆత్మీయత వుంటుందనిపించటం లేదూ? సర్లే చూద్దాం అన్నావుగా. ఇక ఈ బస్సులు ఎప్పుడొస్తాయో? పద, ముగ్గురం తలాకాస్త వేసుకుని ఆటోమీద వెళదాం" అని లేచింది రుక్మిణి.

** ** **

రెండేళ్ళు రివ్వున తిరిగిపోయాయి. ఆ రోజు ఉదయం కూరలు కొందామని సంచీ ఊపుకుంటూ బజారుకొచ్చింది రుక్మిణి. అక్కడ ఒకావిడ కూరల బుట్టకడ్డంగా నిల్చొని అదేపనిగా ఏరుతోంది అరగంట నుంచి.

"అమ్మా! అర్థరాత్రిదాకా ఇలా ఒక్కత్తెవే ఏరుతూ వుంటావా? మమ్మల్ని కూడా కాస్త కొనుక్కోనిస్తావా?" విసుగ్గా అంది రుక్మిణి. "ఎవరమ్మా అది, మంచివి ఏరుకోవాలా వద్దా?" అని వెనక్కు తిరిగిన ఆవిడ "హాయ్ రుక్మిణి బాగున్నావా?" అంటూ చెయ్యి పట్టుకుంది.

"బానే వున్నాను. నువ్వు చాలా మారిపోయావు. హైదరాబాద్ ఎప్పుడు వచ్చావే లతా? ఇక్కడికి దగ్గర్లోనేనా వుండటం. పద మా ఇంటికి పోదాం" అన్నది రుక్మిణి.

లత "అదుగో ఆ కనబడుతున్న డాబాలోనే వుంటున్నాం. ముందు మా ఇంటికే వెళ్దాం పద" అని తీసుకెళ్ళింది.

పోర్షను పెద్దదే. మూడు గదులు, కిచెను, సోఫా సెట్, సీలింగ్ ఫ్యాన్లతో అధునాతనంగా వుంది. "కూచో ఇప్పుడే వస్తాను" అని చెప్పి పెద్ద ఆల్బమ్‌తో వచ్చింది. "మా పెళ్ళి ఎంత గ్రాండ్‌గా జరిగిందనుకున్నావ్. తప్పకుండా వస్తానని రాలేదుగా. అందుకే తరువాత నీకు ఉత్తరాలు రాయడం మానేశాను. ఇదిగో ఇవి పెళ్ళి రోజు ఫోటోలు. ఇవి హనీమూన్ వెళ్ళినప్పటివి. ఈ రవ్వల గాజులూ, రెండు పేటల గొలుసూ పెళ్ళికి నాకు చేయించారు. ఇంతకీ నీ సంగతేంటి? కులాంతరమని ఆ

మధ్య లక్ష్మి చెప్పింది'' అడిగింది లత.

''అవును నిజమే. రిజిష్టర్ ఆఫీసులో స్నేహితుల మధ్య నిరాడంబరంగా జరిగింది. ఈ మధ్యే కాస్త కోపాలు తగ్గి మావాళ్ళు, వాళ్ళమ్మగారు వస్తూ పోతున్నారు. హనీమూన్ ట్రిప్పులూ, నగలూ చేయించుకోలేకపోయినా బాగానే జరుగుతోందిలే. అందులో రెండు వైపుల వాళ్ళూ పెళ్ళికి వ్యతిరేకించడంతో ఇబ్బంది అయి అప్పులు అయ్యాయి. అన్ని హనిమూన్‌లూ ఇంట్లోనే'' నవ్వుతూ చెప్పింది రుక్మిణి.

''ఊ... నువ్వు నొచ్చుకుంటావేమోకాని, ఆ రోజు నాతో పందెం కాసావు గుర్తుందా? మేమైతే అలకపాన్పు మీద మా నాన్నగారు ఇచ్చిన స్కూటర్‌పై హాయిగా తిరుగుతాము. నాకు ప్రతినెల ఒక చీర తప్పకుండా కొనాల్సిందే'' అంది గర్వంగా లత.

''సర్లే. ప్రేమ, సుఖం అంటె అన్నం చీరెలు, నగలు లోనే వుందా? తనకోసం త్యాగం చేసిన వ్యక్తి అనే భావంతో ఒకరినొకరు చూసుకునే చూపుల్లో వుండే ఆత్మీయత, ప్రేమల ముందు చీరెలు, నగలతో కలిగే ఆనందం ఏపాటి? పొదుపుగా వుంటూ మెల్లగా అన్నీ సమకూర్చుకోవచ్చు. తల్లిదండ్రులతో పోట్లాట అన్నావుగా, చూడు మెల్లగా మళ్ళీ మేం కలిసి పోవట్లేదూ. మనం కష్టపడి అమర్చుకున్న ఇల్లు, వస్తువులు ఉపయోగించుకుంటే అప్పుడు వుండే శ్రద్ధ, ఆనందం ఎవరయినా ఇచ్చిన వాటితో వస్తుందా?'' గడగడా చెప్పింది రుక్మిణి తన సహజ ధోరణిలో.

''ఇప్పుడు నీతో పోట్లాటెందుకు. ఎవరి పిచ్చి వారి కానందం. వుండు కాఫీ తాగి వెళ్దువుగాని'' అని లేచింది లత.

''నాకేం మర్యాదలు చెయ్యక్కర్లేదులే. సోఫాలూ, టివీలు, అన్నం గులాబీల్లా వున్నా ఇంత ఖరీదయిన ప్లాస్టిక్ పూలు లేకపోయినా, ముద్దుగా వుండే గులాబి, ఒక చిన్న మందార మొక్కలతో మా ఇల్లు శుభ్రంగానే వుంటుందిలే. సాయంత్రం ఇద్దరూ రండి'' అని గుర్తులు చెప్పి లేచింది రుక్మిణి.

సాయంత్రం ఆరయ్యింది. హుష్! అనుకుంటూ వచ్చి కూర్చున్నాడు లత భర్త లతాకాంత్. ''లతా! లతా!'' అని రెండు మూడుసార్లు అరిచి రాకపోవడంతో హు అని మెల్లగా బూట్లు విప్పుకోసాగాడు. ఇంతలో వచ్చింది లత మంచినీళ్ళ గ్లాసుతో ''ఏమిటీ బాగా అలసి పోయినట్టున్నారు'' అంటూ. ''ఇవ్వాళ పనికొంచెం ఎక్కువగా వుందిలే. చికాగ్గా వుంది. కాఫీ ప్లీజ్'' అన్నాడు.

ఫ్లాస్కులో పోసి వుంచిన కాఫీ అందిస్తే తాగుతూ అడిగాడు ''ఏమిటీ ఇందాక రెండు మూడుసార్లు పిలిచిందాకా రాలేదు. ఏం చేస్తున్నావ్ లోపల'' అని. ''ఇవ్వాళ మా ఫ్రెండ్ రుక్మిణి కలిసింది. మీరు రాగానే వాళ్ళింటికి వెళదామని నగలు వేసుకుంటుంటే, చూడండి ఈ రెండు పేటల గొలుసుకి ఎంత పెద్దగా మరక అయ్యిందో. ఇది పోగొడదామని ప్రయత్నం చేస్తున్నా పోవట్లేదు. దీనితో ఏం పోతాం. రేపు వెళ్దాం. ముందిది బాగు చేయించుకు రండి'' అని కొంచెంసేపు రెస్ట్ తీసుకున్న తరువాత లతాకాంత్‌ని పంపింది.

బజారునుంచి వచ్చిన లతాకాంత్ లతను చూస్తూనే చిదరించుకున్నాడు. నీ మొహం నాకు చూపెట్టద్దన్నాడు. తెల్లబోయిన లత ''గొలుసు సంగతేమయింది? ఎందుకట్లా అనవసరంగా నామీద ఎగిరిపడతారు'' అని నిలదీసింది.

''మీ నాన్న చేసిన సిగ్గుమాలిన పనికి. ఆ గొలుసు గిల్టుది. కాలవలో పారేయమని మొహం మీద నవ్వాడు కంసాలి. అందుకేనా కట్నంలో పదివేలు తక్కువిచ్చి అమ్మాయికి నగలు పెడ్తాం, మీ ఇంటికే వస్తుందిగదా అని అంత ఇదైపోయాడు మీ నాన్న. తర్వాత ఇస్తానన్న నాలుగెకరాల పొలం కూడా మీ తమ్ముడి చదువుకి తాకట్టు పెట్టాడట. ఛీఛీ పాడు వంశమూ, దరిద్రపు సంప్రదాయమూను. మోసపోయి మంచివాళ్ళమకున్నాము'' అన్నాడు.


''అనవసరంగా అనకండి. మా నాన్నేం అట్లాంటి వాడు కాదు'' ఎదురు జవాబిచ్చింది లత.

''ఛ! నోర్ముయ్! తాహతు లేనప్పుడు పెద్ద సంబంధం కావాలని అంత దురాశ ఎందుకు? ఏ క్లర్కు సంబంధమో చాలదు? లేకపోతే మా నాన్న కాళ్ళ మీదపడి అంత ఇచ్చుకోలేము అంటే అప్పుడేం చేసే వాళ్ళమో? అన్నీ మోసపు బుద్ధులు, కక్కుర్తి వేషాలు. లేకపోతే నిన్ను అసలు చేసుకుండేవాడినే కాదు. ఊరికే అరిచి ఊరుకుంటాననుకుంటున్నావేమో, మీ ఊరికి వెళ్ళి రేపు సాయంత్రంలోగా ఇల్లు తాకట్టు పెట్టించయినా ఇంతకి రెండింతలు పొలం విలువతో సహా తీసుకొస్తాను. ఇవ్వకపోయాడా చూడు'' అని విసురుగా బయటకెళ్ళాడు.



మర్నాడు పొద్దున కూరలు కొంటానికి మార్కెట్‌కి వచ్చి, నిన్న సాయంత్రం ఎందుకు రాలేదో కనుక్కుందామని అత్త వాళ్ళింటికి వచ్చిన రుక్మిణి అవాక్కయింది. తలుపులు బద్దలుకొట్టి వున్నాయి. స్పృహలో లేని అతని అంబులెన్సులోకి ఎక్కిస్తున్నారు. పరిగెత్తుకుంటూ వెళ్ళి వాళ్ళ చాకలి కమ్ పనిమనిషిని అడిగింది ఏమయిందని. "ఏం చెప్పమంటారు? నిద్రమాత్రలు మింగిందట. నిన్న రాత్రి ఇస్త్రీ చెవలకని వెళితే అయ్యగారు......" అని మొత్తంచెప్పింది, కళ్ళు ఒత్తుకుంటూ. నిర్ఘాంతపోయింది రుక్మిణి. "నువ్విక్కడే వుండు. మా ఇంట్లో చీటీ పెట్టివస్తా. మనం కూడా హాస్పిటల్‌కి వెళదాం. ఇక్కడ దానికెవరున్నారు పాపం" అని అత్త వాళ్ళూరు ట్రంకాల్ చేయమని వాళ్ళింటి పక్క కుర్రాడికి అడ్రసు చెప్పి కదిలింది.

హాస్పిటల్‌లో అటూ ఇటూ అసహనంగా తిరుగుతున్న రుక్మిణికి ట్రంకాల్ చేసిన కుర్రాడు వచ్చి చెప్పాడు. మీ తమ్ముడిని బస్టాండులో పోలీసులు పట్టుకుని లాకప్‌లో వుంచారని. అసలే దిగుల్గా వున్న రుక్మిణి ఈ వార్తతో నిలువెల్లా భయంతో వణికింది. అత్త సంఘటనతో పోల్చి భయపడింది. ఇంతలో "సాయంత్రం దాకా ఏ సంగతీ చెప్పలేం. ఎట్లాగూ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచాలి. మీరు వెళ్ళి రండి" అని డాక్టర్ చెప్పడంతో ఇంటికెళ్ళింది. తమ్ముణ్ణి




తిడుతూ అటూ ఇటూ తిరుగుతోంది. ఇప్పుడిప్పుడే తనని ఆదరిస్తున్న అత్తమామ ఇక మళ్ళీ ఇటువైపు తిరుగుతారా? భర్త ఎంత అసహ్యించుకుంటాడు? అనుకుంటూ.

ఇంతలో "ఏంటోయ్ అంత కోపంగా తిడుతున్నావు? నన్నేనా?" అని నవ్వుతూ లోపలికొచ్చాడు రుక్మిణి భర్త శ్రీకాంత్. అది కాదు అని చెప్పబోయి మళ్ళీ భర్త ఏమనుకుంటాడోనని ఏం చేయాలో తోచక గుడ్లప్పగించి చూస్తూ నిలుచుంది.

"మీ తమ్ముడి ఘనకార్యం తెలిసిందా" అడిగాడు. ఉలిక్కిపడి "ఆ వాడొక్కడే వెధవ చెడబుట్టాడు" అని అంటుండగానే "చాల్లే గొప్పతనం. పోలీసులు పట్టుకున్నారంటే ఇక దొంగతనం చేసినట్టేనా? నేనూ నీలాగే అనుమానించి వుంటే ఈ పాటికి మనిద్దరం ఇట్లా వుండేవాళ్ళంకాదు. నేను పోలీస్ స్టేషన్‌కెళ్ళి విడిపించి, సాయంత్రం రమ్మని చెప్పి ముందింటికి పంపించా. మీ తమ్ముడు వాళ్ళ ఫ్రెండ్‌ని రిసీవ్ చేసుకోవడం కోసం వచ్చే ప్రతిబస్సు దగ్గర తచ్చాడుతుంటే కొత్త జేబు దొంగేమోనని అనుమానించి పోలీసులు పట్టుకున్నారు. తరువాత వాళ్ళ ఫ్రెండ్‌ని కూడా తీసుకెళ్ళి, అతను వస్తున్నానని రాసిన వుత్తరాలు, బస్ టిక్కెట్లు చూపి కొంచెం చెయ్యితడిపేసరికి వదిలేశారు. ఇక తిట్టుకో" అన్నాడు శ్రీకాంత్.

కళ్ళల్లోంచి నీళ్ళు కారుతుండగా రుక్మిణి గిరుక్కున వెనక్కి తిరిగి భర్తయెదపై తలవుంచి కళ్ళు మూసుకుంది.

●


# నవోదయ రెసిడెన్షియల్ కాలేజి

13 -ఎ (పోస్టాఫీసు ఎదురుగా), సంజీవరెడ్డినగర్, హైదరాబాద్ 500 038.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి

బి.పి.సి., యం.పి.సి., యం.ఇ.సి. & సి.ఇ.సి. గ్రూపులలో ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియములకై

విద్యార్థినీ విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభము

★ ఇంటర్మీడియట్‌తోబాటు EAMCET కై కోచింగ్ మరియు ప్రతి వారాంతంలో Test

★ అనుభవజ్ఞులైన అధ్యాపకులచేత బోధన

★ బోధనా కాలము (ఉదయం 8 గం.నుండి మధ్యాహ్నం 2 గం.) తర్వాత సంబంధిత అధ్యాపకుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్ ద్వారా ప్రతి విద్యార్థియెడల వ్యక్తిగత పర్యవేక్షణ.

★ బాలురకు మాత్రమే హాస్టలు సౌకర్యం కలదు. బాలికలు మరియు బాలురు *Day Scholars*గా చేరే సదుపాయము కలదు.

దరఖాస్తులు మరియు ఇన్‌ఫర్మేషన్ బ్రోచర్‌లకై Secretary పేరిట రూ. 10.00 M.O. చేసిగాని లేదా స్వయంగా చెల్లించి కళాశాల కార్యాలయమునుంచి పొందవచ్చును.

Chief advisor శ్రీ కోవ రామచంద్రారెడ్డి IPS, మాజీ ఐ.జి.పి

Honorary Directors: పోతుకూచి సాంబశివరావు, ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యులు ● విద్వాన్ తేన్నేటి వెంకటసుబ్బారావు, మాజీ ఆంగ్ల శాఖాధిపతి, KITS, వరంగల్

Academic Advisors: ప్రొఫెసర్ ఐ.వి.చలపతిరావు, మాజీ రిజిస్ట్రార్, CIEFL, హైదరాబాద్ ● ప్రొఫెసర్ బి.ఆర్. శాస్త్రి, మాజీ సంస్కృత శాఖాధిపతి, ఉస్మానియా